## జాతరకు వెళ్లే భక్తులకు సకల

# సౌకర్యాలు కల్పించండి

- రద్దీని అంచనావేసుకొని బస్సుల ఏర్పాటుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి
- అవసరమైతే ప్రైవేటు బస్సులను అద్దె ప్రాతిపదిక ఏర్పాటు చేయాలి
- కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు
- కొత్తగూడెం బస్టాండులో మేడారం జాతర బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే



**కొత్తగూడెం, ఫిబ్రవరి18(కెరటం ప్రతినిధి)**

మేడారం జాతరకు వెల్లే భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ రవాణా వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకాన్ని కలిగించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం బస్టాండ్లో మేడారం జాతరకు ప్రయాణ సౌకర్యం కల్పించే ప్రత్యేక బస్సులను ఆదివారం కూనంనేని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం రిబ్బన్ కట్ చేసి సేవా శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జాతరకు 140 బస్సులు ఏర్పాటు చేసినప్పటికి భక్తుల రద్దీ పరిగణలోకి తీసుకొని స్థానికంగా ఉండే ప్రైవేటు బస్సులను అద్దెప్రాతిపదికన వినియోగించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రయాణ ప్రాంగణంలో ముమ్మరంగా పారిశుద్ధ్యపనులు చేపట్టడంతోపాటు విద్యుత్, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. డిపో అధికారులతోపాటు, సిబ్బంది వారం రోజులపాటు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలని తద్వారా మేడారం జాతరకు ఉత్తమ సేవలందించిన డిపోగా పేరుతేవాలని సూచించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకంలోని మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మేడారం జాతర ప్రత్యేక బస్సులకు కూడా అమలు చేయడం అభినందనీయమని, ఈ సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి నష్టపోవద్దని, సురక్షిత ప్రయాణంకోసం ఆర్టీసి సేవలను ఆశ్రయించాలని కోరారు. కొత్తగూడెం డిపో పరిధిలో 30 ఆర్టీసి సంస్థ బస్సులు మరో 34 ప్రైవేటు బస్సులు ప్రయాణ సేవలు అందిస్తున్నాయని, వీటి సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వంపై వత్తిడి తెస్తానన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, డిపో మేనేజర్ వెంకటేశ్వర్రావు, ఫోర్మెన్ రాంబాబు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సునిత, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, కె.రత్నకుమారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జర్పుల ఉపేందర్, యు.హరీష్, నాయకులు గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






## మాదిగల పంతం - బిజేపి అంతం

- యస్.సి వర్గీకరణకు చట్ట బద్దత కల్పించాలి
- లేనిపక్షంలో బిజేపిని 3650కి.మీ బొంద పెడతాం
- రిజర్వ్ ఉంచిన సుప్రీంకోర్టు, తీర్పును వెంటనే వెలువరించాలి
- ఈ నెల 21న ప్రారంభం కానున్న మాదిగల జోడో యాత్రను జయప్రదం చేయండి
- మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు.జోగారావు

**కొత్తగూడెం, ఫిబ్రవరి18(కెరటం ప్రతినిధి)**

మాదిగల పంతం – బి.జే.పి.అంతం అని, యస్.సి వర్గీకరణకు చట్ట బద్దత కల్పించాలని, లేనిపక్షంలో బిజేపిని 3650కి.మీ బొంద పెడతా మని, రిజర్వ్ ఉంచిన సుప్రీంకోర్టు, తీర్పును వెంటనే వెలువరిం చాలని, మాదిగ.జే.ఏ.సి. వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర తొలి యస్.సి. కార్పొరేషన్ చైర్మన్ డా.పిడమర్తి రవి నాయకత్వంలో మాదిగలకు 12% రిజర్వేషన్ సాధనకై ఈ నెల 21న ప్రారంభం కానున్న మాదిగల జోడో యాత్రను జయప్రదం చేయాలని మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు. జోగారావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ సెంటర్లో జరిగిన ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోదుగు. జోగారావు మాట్లాడుతూ.. మాదిగ.జే.ఏ.సి. వ్యవస్థాప కులు, తెలంగాణ రాష్ట్ర తొలి యస్.సి.కార్పొరేషన్ చైర్మన్ డా.పిడమర్తి.రవి నాయకత్వంలో మాదిగలకు 12% రిజర్వేషన్ సాధనకై, "మాదిగల పంతం – బి.జే.పి.అంతం" నినాదంతో ఈ నెల 21నుంచి హైదరాబాద్, అమీర్ పేట్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న తొలి విడత జోడో యాత్రకు మాదిగలు, మేధావులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్య లో పాల్గొని విజయ వంతం చేయాలని కోరినారు. యస్.సి.ల వర్గీకరణ విష యంలో తీర్పును, రిజర్వ్ ఉంచిన సుప్రీంకోర్టు, తీర్పును వెంటనే వెలువరిం చాలని, నిరుద్యో గులైన మాదిగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లలో అన్యా యం జరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. యస్.సి. వర్గీకరణకు చట్ట బద్దత కల్పించకుంటే,ఈ పార్లమెంట్ ఎన్నికలలో బి.జే.పి.ని 3650 కి.మీ.బొంద పెడతామని బి.జే.పి.కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాదిగ జే.ఏ.సి.కొత్తగూడెం నియోజకవర్గ కన్వీనర్ బిరియా. భీమ్ రాజ్,నాయకులు రాజేష్,కుమార్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా ధార నగేష్

**కొత్తగూడెం, ఫిబ్రవరి18(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం ఆర్యవైశ్య అన్నదాన సత్రం నందు కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుని ఎన్నిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరిగినది; అట్టి ఎన్నికలలో శ్రీ దారా నగేష్ 2024, 2025 రెండు సంవత్సరంలకు అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. వారికి రేపాక డి.మనోహర్ మద్దతు పలకగా, అట్టి అభ్యర్థిని మిట్టపల్లి పాండు రంగారావు బలపరిచారు. ఈ సందర్భంగా ధార నగేష్కి శుభాకాంక్షలు తెలియచేసిన వారు పల్లపోతు సాయిబాబా, కంభంపాటి రమేష్, దారా రమేష్, చారుగుండ్ల శ్రీమన్నారాయణ, కొదమూరు సత్యనారాయణ, వందనపు రామారావు తదితరులు ఉన్నారు.

### డబ్ల్యుబీఏఎఫ్‌లో సీనియర్ అసోసియేట్‌గా

## నాసిర్ అలీ ఖాన్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, ఫిబ్రవరి18(కెరటం ప్రతినిధి)**

హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్థాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ వరల్డ్ బిజినెస్ ఏంజిల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్ (డబ్ల్యుబీఏఎఫ్) తాలూకా ఎంటర్‌ప్రెన్యూర్స్ గ్రూప్‌లో డిప్లమసీ ఇన్ యాక్షన్‌లో సీనియర్ అసోసియేట్‌గా ఉండేందుకు ఆహ్వానం అందింది. వరల్డ్ బిజినెస్ ఏంజిల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బేబర్స్ అల్తుంటాస్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్‌కు స్వయంగా ఆహ్వానాన్ని అందించారు. వరల్డ్ బిజినెస్ ఏంజిల్స్ ఏంజిల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్ అనేది జీ20 గ్లోబల్ పార్టనర్‌షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ (జీపీఎఫ్ఐ) అనుబంధ భాగస్వామి. సీనియర్ అసోసియేట్‌గా సహకారాన్ని పెంపొందించడం, గ్లోబల్ బిజినెస్‌లో సానుకూల మార్పులో నడిపించడం ఉంటాయి. ఈ సందర్భంగా డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక సంస్థలోనికి సభ్యుడిగా ఆహ్వానించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. డబ్ల్యుబీఏఎఫ్ సభ్యులుగా బేబర్స్ అట్లుంటాస్‌తో సహకరించేందుకు ఎదురు చూస్తున్నానన్నారు. గ్లోబల్ బిజినెస్లో సానుకూల మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నానని తెలిపారు. విశిష్ట ఆలోచనాపరులు ఉన్నది ఈ వరల్డ్ బిజినెస్ ఏంజిల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్. ఉత్తర మాసిడోనియా 4వ అధ్యక్షుడు ప్రొఫెసర్ జార్జ్



ఇవనోవ్, క్రొయేషియా 3వ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్సీ ఇవో జోసిపోవిక్, గినియా మాజీ ప్రధాన మంత్రి, ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి మాజీ ఉపాధ్యక్షుడు లాన్సనా కౌయాటే, థాయిలాండ్ మాజీ ఉప ప్రధానమంత్రి ప్రొఫెసర్ యంగ్యూత్ యూత్వాంగ్, పోర్చుగల్ మాజీ ఉప ప్రధాన మంత్రి, విద్యా మంత్రి ఆంటోనియో శాంటోస్, కొసోవా మాజీ ఆర్థిక మంత్రి ప్రొఫెసర్ హైక్మేట్ బజ్రామి, కాంగో ఎస్ఎంఈ అభివృద్ధి మాజీ మంత్రి వైనీ అడిలైడ్ మౌగనీ, అల్బేనియాలోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రక్షణ కోసం మాజీ మంత్రి ఎడ్వర్డ్ షాల్సీ, ఘనా టూరిజం మంత్రి డాక్టర్ ఇబ్రహీం మొహమ్మద్ అవల్, కోస్టారికా మాజీ విదేశాంగ మంత్రి మాన్యుయెల్ ఏ గొంజాలెజ్-సాన్జ్, ట్యునీషియా మాజీ డిజిటల్ ఎకానమీ మంత్రి నూమనే ఫెహ్రీ, సింగపూర్ మాజీ పార్లమెంటు సభ్యుడు ప్రొఫెసర్ ఇంద్రజిత్ సింగ్ తదితరులు కలరు.

## పొంగులేటి వారి ఇంట్లో పెళ్లి సందడి

### భారీ సంఖ్యలో బయలుదేరిన కాంగ్రెస్, ఐఎన్‌టియుసి నాయకులు

**కొత్తగూడెం, ఫిబ్రవరి18(కెరటం ప్రతినిధి)**

రాష్ట్ర రెవెన్యూ, ప్రచార శాఖ మంత్రి పొంగులేటి శీనన్న తమ్ముడు పొంగులేటి ప్రసాద రెడ్డి, లక్ష్మీల కుమారుడు లోహిత్ రెడ్డి, భవానిల వివాహ రిసెప్షన్ సందర్భంగా ఐఎన్‌టియుసి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా, సత్తుపల్లి నుండి కల్లూరు (మండలం) నారాయణపురానికి భారీ సంఖ్యలో బయలుదేరి ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన అతిథులకు ప్రశాంతమైన వాతావరణంలో భోజన సదుపాయం కల్పించడం జరిగింది, అలాగే ఫస్ట్ ఎయిడ్ సెంటర్, అతిథులకు కూర్చోవడానికి గ్యాలరీలు ఏర్పాటు చేయడమైనది. భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రులు, శాసన సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వధూవరులను ఆశీర్వదించారు.

